# బహుఛత్రాధిపతి

మాజీ యమ్మెల్యే బాపినీడు ఉదయమే లేచి శ్రీ వెంకటేశ్వర స్వామివారికి కొబ్బరి కాయకొట్టి, ఆంజనేయ స్వామివారికి హారతిచ్చి, 'శ్రీరామ చంద్రా ! ఏడేళ్ళ నుంచి వన వాసం చేస్తున్నా నీకు దయగలగడం లేదా! ఇప్పుడేనా నన్ను రూలింగ్ పార్టీలో చేర్పించు రామయ్యా తండ్రి' అని శ్రీరామచంద్ర మూర్తిని, రాముడు కాకపోతే రహీం కరుణించి తన్ను పదవిలోకి లేపకపోతాడా అనే సెక్యూలర్ ఆశతో 'బిస్మిల్లా యే రెహ్మాన్ ఉర్ రహీం' అని రహీంనీ, ఇంకా కోటి దేవుళ్ళందర్నీ పేరు పేరునా, పక్షపాతం లేకుండా పదవి కోసం వేడుకుని, ఏడుగంటలవుతుండగా అప్పాజీకి ఫోన్ చేశాడు.

అప్పాజీ నేటి రాజకీయాలకి గంగోత్రి లాంటివారు. ఎనభై ఏళ్ళొచ్చాక క్రియాశీల రాజకీయాలనుంచి రిటైరై, ముసలి పులిలా వానప్రస్థాశ్రమంలో ఉంటూ, తెర వెనుకనుంచి రాజకీయాలు నడిపిస్తున్నారు ఆయన ప్రస్తుతం. స్టేట్ లోనూ, సెంట్రల్‌లోనూ , లెఫ్ట్ రైటు, సెంటర్ పార్టీల్లోనూ - అన్ని చోట్లా ఆయన శిష్య గణం ఉంది.

అలాంటి ఆపోజిషన్ శిష్యపరమాణువు బాపినీడు ఫోను పక్కమీంచే అందుకుని, ఏంటి బాపినీడు! నిద్రపోనివ్వవుకదా! తెల్లారకుండానే ఫోన్ చేశావేంటి? అన్నారు అప్పాజీ బద్ధకంగా.

'నా బతుక్కి తెల్లారడమంటూ ఉంటదా, అప్పాజీ! ఏడేళ్ళనుంచి పవర్ కట్టయి చీకట్లో పడేడుస్తున్నా తమరికి దయ కలగడం లేదు' అన్నాడు బాపినీడు దిగులుగా.

'నా దయేంటి? ఆ దేవుడి దయుండాలి గాని '

'కనికరించి గుడి కడితే గుళ్ళో ఉంటాడు, కోపగించి తన్ని తగలేస్తే ఈదిలో ఉంటాడు. మీలాంటోళ్ళు ఎలా ఆడిస్తే అలా ఆడుతూ మీ దయా దాక్షిణ్యాలమీద బతికేవోడు. ఆడి దయ నాకెందుకు, మీ దయుండాలి గానీ' అని దేవాంతకుణ్ణి కొంచెం పొగిడి, 'బాపినీడు మీ శిష్యపరమాణువేకదా! ఆడు ఎక్కడ సచ్చాడో, ఎలా సచ్చాడో పట్టించుకుంటున్నారా?' అన్నాడు బాపినీడు అభిమానంగా ఆరోపణ చేస్తూ.

'పట్టించుకోకపోవడమేమిటి? ఏళాపాళా లేకుండా రేత్రీ, పగలూ ఫోన్ చేసి నన్ను సంపు తూనే ఉన్నావు గదా! అయినా నేనప్పుడే సిలక్కిచెప్పినట్టు చెప్పాను - ' నీ పార్టీకి నూకలు చెల్లిపోయాయి బాపినీడు - జెండా మార్చి రూలింగుపార్టీలో కల్సిపో' అని - ఇన్నావా? పొలి టీషియన్ గాలి కోడిలాంటాడు. ఎటు గాలి వీస్తుందో చూసి గమ్మున అటు తిరిగి పోవాలి. లేకపోతే ఆడికి లైపుండదు' అని గాలికోడి న్యాయం వివరించారు అప్పాజీ.

ఆ సంగతి బాపినీడికీ తెలుసు. 'గాలి' వీస్తోందని తెలిసింది కాని, ఎటునుంచి ఎటు వీస్తోందో సరిగా అర్థం కాక రాంగ్ డైరెక్షన్‌లో, రాంగ్ టైంలో తిరిగిపోయి దెబ్బ తినేశాడు బాపినీడు. ఆవిషయం గుర్తుకొచ్చి, 'వాలు గాలనుకుని ఎదురు గాల్లో నిలబడి హైదరా బాద్‌నుంచి ఎగిరి అంతర్వేది సముద్రంలో పడ్డాను అప్పాజీ! మన జాతకం బాగోలేదు. ఏపార్టీలో కాలెడితే అది అపోజిషన్లోకి పోతోంది' అన్నాడు బాపినీడు దిగులుగా .

'అందుకే రూలింగ్ పార్టీ వోళ్ళు నిన్ను చేర్చుకోవడానికి బయపడతన్నారు. నీ జాతకం దెబ్బ ఆళ్ళకు కూడా తగుల్తుందేమో నని ఆళ్ళ బయం'

'బాబ్బాబు! ఇది ఫోను కాదు, మీ కాళ్ళనుకోండి . పదవి లేకుండా ఈదిలో కెల్లా లంటే ఒంటిమీద నూలు పోగు లేకుండా ఎళ్ళినట్టు సచ్చే సిగ్గుగా ఉంది. నా మానం కాపా డండి అప్పాజీ' అన్నాడు బాపినీడు కళ్ళనీళ్ళతో.

'ఈ ఫీల్డులో దిగినోడికి సిగ్గూ లజ్జా ఉండకూడదు: కిందటెలక్షన్లలో పెద్దసూరీడు సన్నాసోడి ఏషం ఏస్తే, చిన్నసూరీడు సీర కట్టుకుని ఓట్లడగలేదూ! ఆళ్ళేమన్నా సిగ్గుపడ్డారా?'

'ఆళ్ళ సంగతి ఇప్పుడెందుగ్గానీ, బాబ్బాబు, పవర్ కనెక్షన్ ఇప్పించండి అప్పాజీ! మీ రుణం ఉంచుకోను' అన్నాడు బాపినీడు బతిమాలుతూ.

'సూద్దాం లే'

'సూద్దాంలే అంటే కాదు. మీరో మాట చెబితే ఆళ్ళు కాదనరు. మీరీ పని సెయ్యక పోతే 'నా సావుకి కారణం అప్పాజీయే' అని ఓ ఉత్తరం రాసి మీ ఇంటిముందు ఏపసెట్టుకి ఉరేసుకు సచ్చిపోతాను. ఆపైన మీఇష్టం.' అన్నాడు బాపినీడు గారంగా మంకుతనం చేస్తూ.

'రూలింగ్ పార్టీ వోళ్ళతో ఇవాళ మళ్ళీ గట్టిగా మాట్లాడతానుగాని, నువ్వాపని చెయ్య కు. నాకు సచ్చిన సెవాలంటే సచ్చే బయం'

అప్పాజీ దగ్గర అలా మాట తీసుకుని, హుషారుగ్గా ఫలహారం చెయ్యడానికి డైనింగ్ టేబుల్ ముందర కూర్చున్న బాపినీడుకి ఎదురుగా బిస్కెట్ల ప్లేటు

కనిపించగానే, 'ఇదేంటి? రోజూ  కుక్క బిస్కట్లేనా! కోడిగుడ్లట్రా' అని అరిచాడు చికాగ్గా.

రెండు నిమిషాల తర్వాత బాయిల్డ్ ఎగ్స్ మీద ఆయన చెయ్యి పడబోతుండగా రోజూలాగానే బుల్లోడు న్యూస్ పేపర్‌తో వచ్చి, సుప్రభాతం చెప్పి కూర్చో బోతూ కోడిగుడ్ల ప్లేటు చూసి ఉలిక్కిపడ్డాడు. బుల్లోడు  బాపినీడుకి సెక్రటరీ. పదో తరగతి పాసై రోడ్ల మీద తిరుగుతుంటే బాపినీడు గారు దయతలచి ఏదైనా ఉద్యోగం ఇప్పించక పోతారా అనే ఆశతో బుల్లోడి తండ్రి వాడిని ఆయన కొలువులో పెట్టాడు. తండ్రికున్న ఆశలు కాని, బాపినీడు గారంటే భయభక్తులు కాని కొడుక్కిలేవు.

'పేపర్లో ఏంటి వార్తలు బుల్లోడా?'

రోజూ ఆయన నాస్తా తీసుకునే  టైములో బుల్లోడు పేపరు చదివి వినిపిస్తూంటాడు. బాపినీడు ప్రశ్న  వినిపించుకోకుండా కోడిగుడ్ల ప్లేట్ కేసే చూస్తూ , 'అదేంటి? అలా కోడి గుడ్లు తినేస్తున్నారు. అసలే మీరు బీపి, హార్ట్ పేషెంటు' అన్నాడు బుల్లోడు  ఆశ్చర్యంగా.

ఆ మాట వినగానే బాపినీడు బీపీ అయిదు పాయింట్లు పెరిగింది. పెరిగిపోతున్న రక్తపోటుని అదుపులో తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూ 'పేపరు చదువు బుల్లోడా' అన్నాడు ఓ కోడి గుడ్డు అందుకుంటూ.

'అందులో కోలెస్ట్రాలుంటుంది' అన్నాడు బుల్లోడు హెచ్చరిస్తూ.

'అదేంటి?'

'అది లోపలికెళ్ళి గుండెకట్టుకుని పిసికేస్తది. పేపర్లో ఇప్పుడే చదివా'

బాపినీడు గుండెల్లో ఒక్కసారి సూది పుచ్చుకు పొడిచినట్లయింది. అయినా బింకంగా 'డాక్టర్లలాగే అంటారు బుల్లోడా! అయి మనం పట్టించుకోకూడదు,' అన్నాడు.

'మా పెద్ద మావయ్య ఇలాగే వాదించి, కోడికి కోడి లాగించేసి, చేతులు కడుక్కోడానికి నూతి దగ్గరికెళ్ళి, అక్కడ బాల్చీ తన్నేశాడు. మళ్ళీ లేవలే' - డాక్టర్ల మాట పట్టించుకోకపోతే ఏమవుతుందో సోదాహరణంగా వివరించాడు బుల్లోడు.

'నువ్వెళ్ళి ఆఫీసు గదిలో కూర్చో బుల్లోడా' అని బుల్లోణ్ణి పంపించేసి, 'పోన్లే! ఇదీ మన మంచికే. ఇప్పుడిప్పుడే కొంచెం సిక్కుతున్నాం. హెల్తు బాగుపడి మళ్ళా పవర్లోకి వచ్చేటప్పటికి ఫిట్టుగా ఉంటాం అనుకుని కోడి గుడ్ల ప్లేటు అవతలికి గెంటి, 'కుక్క బిస్కెట్ల' ప్లేటు అందుకుని, నాస్తా అయ్యాక, 'బుల్లోడా! నేను దేశాటనకెడుతున్నాను. ఆఫీసు జాగ్రత్త' అని చెప్పి, దేశాటనకి బయలు దేరాడు మాజీ ఎమ్మెల్యే బాపినీడు.

కారుమీదకంటే పవరులేనివాడు కాలినడకనే ఓటర్లకు దగ్గరవుతాడని బాపినీడు పాద యాత్ర చేస్తూ, రైలు గేటుపక్కన కిళ్ళీ కొట్టు దగ్గరకు చేరాడు ఆయాసపడుతూ.

'ఏంటి విశేషాలు? '- అడిగాడు బాపినీడు కిళ్ళీ కట్టించుకుంటూ.

'ఏం విశేషాలు బాపినీడుగారూ - కొంపలంటుకుపోతే '

'ఎవరి కొంపలంటుకున్నాయంట?' - తాపీగా కిళ్ళీనములుతూ అడిగాడు

బాపినీడు.

'రాత్రి జేజే నగర్ అంటుకుపోయింది. తవరికి తెల్దా?'

బాపినీడు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. 'బంగారం లాంటి వార్త తెలీ లేదు. ఈ పాటికి పేపర్లో ఫొటోలతో సహా పడేది. ఇంకా మించిపోయింది లేదు' అనుకుని ఇంటికి పరుగు తీశాడు.

'బుల్లోడా ! నిన్న రాత్రి జేజే నగర్ అంటుకుపోయిందట తెలుసా?' - అడిగాడు బాపినీడు.

'తెల్దు'- కుర్చీలో వాలిపోయి, టేబుల్ మీద కాళ్ళు పెట్టి, సినిమా పత్రికల్లో బొమ్మలు తదేక దీక్షతో చూస్తున్న బుల్లోడు, బాపినీడు గొంతు వినిపించగానే కాళ్ళు టేబుల్ మీదనుంచి దించి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు.

'నీకేం తెల్దు? కోడిగుడ్డులో కొ...కొ...కొ...కొ...'

'కొలెస్టరాలు - గుండెకంటుకుని పిసికేస్తది'

'అదే - అలాంటెదవ నాలెడ్జి తప్ప పనికొచ్చేదొక్కటీ తెల్దు'

'ఊళ్ళో ఎయ్యి జరుగుతాయి. నాకేం తెలుస్తాది?'

'మరి నీ ఉద్యోగం ఏంటి?'

'ఇది ఉద్యోగవా!' - బుల్లోడు ఆశ్చర్యంగా ప్రశ్నించి , బాపినీడు తెల్లమొహం వేయ డం చూసి, తనే సమాధానం చెప్పాడు - 'అరవై రూపాయల బోడి జీతానికి అరవచాకిరీ'

'సర్లే! సర్లే! నీతో వాదించడానికి నాకు టైం లేదు. నేనాళ్ళని పరామర్శించడాని కెళుతున్నా. నువ్వు దాసుకి ఫోను చేసి కెమేరా పుచ్చుకు రమ్మని చెప్పు. ఇదిగో, కుర్ర గాడిదను పంపించొద్దను. ఎదవ ఫొటో ఎలా తీశాడో చూశావుగదా' అన్నాడు బాపినీడు,గతం గుర్తుకొచ్చి నిట్టూరుస్తూ.

ఆ మధ్య గోదావరి వరదలు వచ్చినప్పుడు ఏటి గట్టున కట్టేసిన పశువుల్ని పరా మర్శించడానికి వెళ్ళాడు బాపినీడు. ఆ సమయంలో ఓ గేదెకి ఆయన స్వయంగా గడ్డి తినిపిస్తుంటే ఈగంత దోమ ఒకటి ముక్కుమీద వాలి ఆయన్ను విసిగించసాగింది. ఆయన ముక్కు కదిపీ, బుగ్గలాడించీ, మీసాలూగించీ, దోమను లేపుదామని ఎంత ప్రయ త్నించినా కదలలేదు. మరి లాభం లేదని, 'నీ యమ్మా....' అని దోమని తిడుతూ కుడిచేత్తో ముక్కుమీద కొట్టుకుంటూ వుండగా, దాసు అసిస్టెంటు (కుర్రగాడిద) ఫొటో లాగేశాడు. బుల్లోడు బాపినీడుకి చూపించకుండానే ఆ ఫొటో ప్రెస్‌కి పంపేశాడు.

మర్నాడు ఆ ఫొటో నగరం నుంచి వెలువడే సంచలన పత్రిక 'కోడికూత' మొదటి పేజీలో ప్రచురించబడి సంచలనం కలిగించింది.

'బాపినీడు గేదెలకి గెడ్డెడతన్నాడా, లేకపోతే ఆటికాడ గెడ్డి లాక్కుని తినేస్తన్నాడా' అని ఎగస్పార్టీ వాళ్ళు చమత్కరించారు, ఆ ఫొటో చూసి.

బాపినీడు గేదె దగ్గర గడ్డి లాక్కుని తినేస్తుంటే, 'ఎలాంటోడు ఎలా అయిపోయాడు బాపినీడు,' అని గేదె జాలిగా ఆయన వైపు చూస్తున్నట్లుగా ఉంది ఆ

ఫొటోలో.

'ఎంత పవర్లో లేకపోతే మాత్రం గేదెలకాడ గెడ్డి అలా తినొచ్చా బాపినీడు? అందులోనూ పబ్లిగ్గా,' అని బాధపడ్డారు ఆయన పార్టీవాళ్ళు.

'నేను గెడ్డడతన్నాను కాని గెడ్డి తింటల్లేదు బాబోయ్! ఈ మధ్య హెల్తు బాగోక డైటింగుకూడా చేస్తన్నా' అని గొల్లుమన్నాడు బాపినీడు.

'మేమంతా డైటింగు చెయ్యటంలా పవరుపోయాక? మన సోములు గాడెలా టోడు? పదివేల టన్నుల సిమెంటు తిని అరాయించుకుని పైల్వానులా తిరిగేవోడు. ఎంక్వయిరీ కమిషను జడ్జిగారికి ఆడు తిన్న సిమెంటేమైందో అంతే తెలీలేదు. ఆడి బ్లడ్ టెస్టు చేసి 'నా సర్వీసులో ఎంతో మంది కేడీల్ని, డాకూల్ని చూశాను గాని, నీలాంటోణ్ణి సూళ్ళేదు. నీ బ్లడ్ లో సిమెంటు ట్రేసే కనిపించడం లేదు' అని ఆశ్చర్యపోయి, అభినందించి, క్లీన్ సర్టిఫికెట్ ఇచ్చేసి సుప్రీంకోర్టుకి ఎళ్ళిపోయాడు. అలాంటి ఆకలి, జీర్ణ శక్తి ఆడిది. మొన్న తిరుపతిలో 'రాజుగారూ, రాజుగారూ' అంటే, ఆణ్ణి చూసి అడుక్కు తినేవోడనుకుని ఓ రూపాయి చేతిలోపెట్టి ఎళ్ళి పోతుంటే, ఆడుచేతులట్టుకు గొల్లు మంటే తెలిసింది సోములుగాడని. ఈ నాలుగేళ్ళ కరువులోనూ తినడానికి ఏం చిక్కక టి.బి. పేషెంటులా అయిపోయాడు.

ఆడే కాదు, మేవంతా ఎలా అయిపోయావో సూడు. ప్రెతీ కుక్కకీ ఓ మంచి రోజుంటుందన్నాడు ఇంగ్లీషోడు. ఆ మంచి రోజు కోసం కళ్ళల్లో ప్రాణాలెట్టుకుని ఎదురు సూస్తున్నాంగానీ, నీలా గేదెలకాడ గెడ్డికి కక్కుర్తడ్డావా?' అని పార్టీ రాజుగారు మందలించి- 'ఏంటి, అప్పాజీతో డైలాగులు నడుపుతున్నావంట?' అని ప్రశ్నించారు, బాపినీడు పార్టీ మార్చబోతున్నాడన్న వార్తలు ప్రస్తావించి.

'అప్పాజీ అలా రూమర్లు పుట్టిస్తున్నాడా! కాటికి కాళ్ళు సాచిన ముసిలోడికి ఇదేం బుద్ది?' అని ఆశ్చర్యం నటించి, 'రాజుగారు సివరికి నా పాతివ్రత్యాన్నే సెంకిస్తున్నారన్నమాట!' అని బాధపడి, 'ఆల్లకి ఓ ఐడియాలజీ, పాయింటూ, ప్రోగ్రాం ఉన్నాయా? ఛ......ఛ..... పంది జన్మెత్తి బురదగుంటలోనైనా దిగుతానుగాని, ఆ పార్టీలో చేరతానా?' అన్నాడు బాపినీడు ఆవేశంగా.

'ఆ ముక్క పబ్లిగ్గా చెప్పి పత్రికలాళ్ళ నోరు మూయించకూడదూ!'

'ఆళ్ళను చేతికొచ్చినట్లు రాసుకోనివ్వండి, నా సంగతి తవరికి తెలీదా? '

'నీ సంగతి నాకు తెలీదా?'

'మీ తోడు'

'నన్ను సంపేకు బాపినీడు! ఇంకా బాగా పైకెళ్ళి సీయంవో, పీయంవో అవ్వాల్సినోణ్ణి' అన్నారు రాజుగారు అదిరిపడి.

రాజుగారి తీరు చూస్తుంటే ఆయనకు తన మాట మీద విశ్వాసం కలగలేదేమో నని అనుమానం వచ్చి, గమ్మున కుర్చీలోంచి కిందకు జారి రాజుగారి చెప్పులందుకుని, నెత్తి మీద పెట్టుకుని పరుగు తీశాడు బాపినీడు.

రాజుగారుతేరుకుని, 'నువ్వెల్లాయలిస్టువే బాపినీడూ! ఒప్పుకున్నాను. నా చెప్పు లిచ్చేసే' అంటూ బాపినీడు వెనకాలే కొంత దూరం పరుగెత్తి, తారురోడ్డు మీద

కాళ్ళు కాలగా రెట్టింపు వేగంతో వెనక్కు వచ్చిపడి, 'తెల్లారి లేచింతర్వాత ఇది మూడో జత. వచ్చిన ప్రతీవాడు చెప్పులట్టుకుపోవడానికి ఇది పార్టీ ఆఫీసా? బాటా షాపా?' అంటూ చిందులు తొక్కారు.

ఆ రాజుగారు నిన్న రాత్రి తనంతట తనే ఎందుకనో ఫోనుచేసి బాపినీడు ఆరోగ్యం గురించి పరామర్శించి, అవీ ఇవీ మాట్లాడి, 'ఆ రూమర్లు ఖండిస్తూ నీ పేర నేనే ఓ ప్రెస్సు స్టేటుమెంటు ఇచ్చేశాను బాపినీడూ' అన్నారు క్యాజువల్‌గా.

'మంచి పనిచేశారు. అసలు నేనే వచ్చి తమ దర్శనం చేసుకుందా మనుకుంటున్నాను'

'నువ్వు రావద్దు బాపినీడోయ్' అంటూ రాజుగారు కంగారుగా ఫోన్ పెట్టేసి, చెప్పులు స్టీలుబీరువాలో పెట్టి తాళం వేసి, బీరువా తాళం చెవులు డ్రాయర్‌లో పెట్టి డ్రాయర్ తాళం వేసి, ఇంకా ధైర్యం చాలక, 'ఒరేయ్ సెక్రటరీ! నువ్వు ఆఫీసు బయట నుంచి తాళం వేసి బాపినీడొస్తే నేను ఏక్సిడెంటులో సచ్చిపోయానని సెప్పు' అంటూ టేబుల్ కిందకు డైవ్ చేశారు.....

అగ్నిబాధితులను పరామర్శించడానికి వెళ్ళ బోతున్న బాపినీడు ఆ విషయం గుర్తుకొచ్చి రాజుగారు నిన్న రాత్రి అంత అర్జెంటుగా ఎందుకుఫోను చేశాడా అని ఆలో చిస్తూ, మేకప్పు మార్చడానికి లోపలికి వెళ్ళాడు

'హలోదాసుగారూ! నేను బాపినీడుగారి సెక్రటరీ బుల్లోణ్ణి మాట్లాడుతున్నా నండి. మీరు అర్జంటుగా జేజే నగర్ వెళ్ళాలండి. బాపినీడు గారు అక్కడికెళ్ళారండి...... బాబ్బాబు..... కుర్రగాడిదను పంపించకండి. శ్రమనుకోకుండా మీరే వెళ్ళండి. ఫొటో సరిగ్గా రాకపోతే గోల పెట్టేస్తాడు ముసిలి ముండాకొడుకు'

'ఎవుణ్ణి పరగడుపునే తిడతన్నావు? ' - సందర్భానికి తగినట్టు మాసిపోయిన గళ్ళ లుంగీ, చిరిగిపోయిన బనియను వేసుకుని నెత్తిమీద పాతబట్టల మూట పెట్టుకుని లోపలి నుంచి హాలులోకి వస్తూ చివరి మాటలు విన్న బాపినీడు అనుమానంగా అడిగాడు.

'దాసుని - కుర్రాణ్ణి రావద్దంటున్నాను. వాడు సరిగా తియ్యకపోతే దాసు గోలెడతా డని, దాసునే పంపించమంటున్నాను' అని ఏ మాత్రం తడబడకుండా సమాధానం చెప్పాడు బుల్లోడు.

'ఈడు చెప్పేది ఏది నిజవో, ఏదబద్ధవో, దేవుడికైనా తెలీదు. ఈడు పూర్తిగా ఆర్నెల్లు నా అండర్‌లో ఉంటే నన్ను మించినాడైపోతాడు 'అనుకుని, ' దాసుకి మళ్ళీ ఫోన్జేసి పెర్సనల్‌గా రమ్మన్నానని పెర్సనల్‌గా నేను చెప్పినట్లు చెప్పు ' అని జేజే నగర్‌కి పరుగు తీశాడు బాపినీడు.

అక్కడ బట్టల మూట దించి అందరకీ పాత బట్టలు పంచిపెట్టాడు. ఓ కుర్రాణ్ణి ఎత్తుకుని వాడి చీమిడి ముక్కు తుడిచి, ముద్దాడి , చాక్లెట్ నోట్లో పడేసి కితకితలు పెట్టి నవ్వించాడు. కాలిపోయిన పాకలో దిగులుగా కూర్చున్న ముసలయ్యను, ఏడ్చేదాకా ప్రశ్నించి కళ్లు తుడిచాడు. ముసలమ్మ నాలుగు నూకల్తో గంజి కాచుకుంటూంటే, 'అమ్మా - నాకు ఆకలేస్తోందమ్మా' అంటూ ఆ గంజి తాగేశాడు.

బాపినీడు వెనకాలే తన పని తాను చేసుకుపోతున్న ఫొటో(గ్రాఫరు దాసు ఉలిక్కిపడి, 'ఓవర్రైపోయి బాపినీడు గారికి ఓ ఓటు పోయింది,' అనుకున్నాడు మనసులో.

అగ్ని బాధితులందరికీ ఒక్కొక్కరికీ లక్షరూపాయలు ఆర్థిక సహాయం చేయాలనీ, వాళ్ళు తీసుకున్న బేంకు లోన్లు మాఫీ చెయ్యాలనీ, అగ్ని బాధితుల పిల్లలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లుండాలనీ, అక్కడ బడుగు వర్గాలకు ఓ బడుగు సినిమాహాలు కట్టించి , బడుగు సినిమాలు ఉచితంగా చూపించాలనీ డిమాండుచేసి, ఆ డిమాండ్లన్ని ప్రభుత్వం అంగీకరించేవరకు ఆ క్షణం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నానని హర్షధ్వానాల మధ్య ప్రకటించి, ఓటర్లకు అలా చేరువయ్యే అవకాశం కల్పించినందుకు అగ్నిదేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుని, ఇంటికొచ్చి తృప్తిగా భోంచేసి నిద్రపోయాడు బాపినీడు.

***

మర్నాడు ఉదయం బాపినీడు డైనింగ్ టేబుల్ ముందర కూర్చుని, ఆమ్లెట్-బ్రెడ్ స్లైసులూ తినబోతుండగా బుల్లోడు న్యూస్ పేపర్‌తో వచ్చి, ఆమ్లెట్ల ప్లేటు చూసి, 'ప్చ్.... ప్చ్..... ' అంటూ నిట్టూర్చి నిలబడి పోయాడు.

'ఈ ఎదవ దిష్టి తగిలింది ఇవ్వాళ కూడా ' అని మనసులో తిట్టుకుని ప్లేటుమీంచి వాడి దృష్టి మరల్చడానికి , ' ఏంటి దేసం విశేషాలు బుల్లోడా' అనడిగాడు బాపినీడు.

'రత్నం టాకీసు ప్రొప్రైటరు రత్నం తెలుసా?'

' ఆడు తెలీకేం - గున్న ఏనుగులా సూడముచ్చటగా తిరుగుతుండేవోడు'

'ఇక ఆడు గున్నఏనుగులా సూడముచ్చటగా తిరగడు'

'అదేంటి?'

'ఆడు నిన్న రాత్రి సచ్చిపోయాడు'

'ఏం పాపం?'

'హార్టెటాకుట....'

బాపినీడు గుండెల్లో మళ్ళీ ఒకసారి సూది పుచ్చుకు పొడిచినట్లయింది. విసురుగా ఆమ్లెట్ల ప్లేటు పక్కకు తోసేసి, బిస్కెట్ల ప్లేటు అందుకుంటూ, 'తెల్లారకుండా సావు కబురు మోసుకొచ్చావు' అన్నాడు రుస రుసలాడుతూ.

'నిన్న కొంపలంటుకుంటే చెప్పలేదన్నారు కదా'

'అది న్యూసు బుల్లోడా'

'కొంపలంటుకోడం న్యూసయితే గుండాగిసావడం కూడా న్యూసే' అన్నాడు బుల్లోడు వాదనలోకి దిగుతూ.

'కాదు'

'అవును'

'కొంపలంటే ఓట్లు బుల్లోడా - నీకు పాలిటిక్సు తెలీదు. అదేరు, ఇదేరు'

'వేరు కాదు, అదీ ఇదీ ఒకటే'

'కాదు '

'అవును'

'ఇంక వాదించకురా మొగడా, నా బీపీ పెరిగిపోతోంది. అసలు నువ్వు నాకు సెక్రటరీవా, లేకపోతే నన్ను సంపేడానికి ఎగస్పార్టీ వోళ్ళు పంపించిన ఏజెంటువా' అని అరుస్తుండగా అప్పాజీ కారు వచ్చి ఆగింది.

హడావిడిగా కారు దిగుతూ, 'కొంప మునిగింది బాపినీడూ' అన్నారు అప్పాజీ.

బాపినీడు కళ్ళు మిలమిలా మెరిసాయి. ఈ రోజు ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుండగా దేవుడిచ్చిన వరంలా వచ్చిందీ వార్త. మరి ఆలోచించకుండా కారులోకి దూకి, 'పదండి' అన్నాడుబాపినీడు.

'ఎక్కడికి? ' - అయోమయంగా అడిగారు అప్పాజీ.

'కొంపలు మునిగాయి కదా. వరద బాధితుల్ని పరామర్శించొద్దాం. ఒరే బుల్లోడా! నువ్వు దాసుకి ఫోన్జెయ్.....'

'నా తలకాయలా ఉంది' అన్నారు అప్పాజీ తలపట్టుకుంటూ.

'ఏమైంది?'

'అంతా పెంట పెంట చేశావు కదా బాపినీడూ?'

'ఏమైంది ? సూటిగా చెప్పండి' అన్నాడు బాపినీడు అయోమయంగా.

'ఏంటిది?' అన్నారు అప్పాజీ ఆ రోజు పేపరు చూపిస్తూ -'పంది జన్మ ఎత్తి బురద గుంటలోనైనా దిగుతాను కానీ, రూలింగ్ పార్టీలో చేరతానా?నీలివార్తలు ఖండిస్తూ బాపినీడుగారి ప్రకటన' అన్నవార్త చూపించి - 'నా బొంద ఏంటిది? రెండ్రోజులు రూలింగోళ్లకి నచ్చ చెప్పి నిన్ను చేర్చుకోవడానికి ఒప్పిస్తే ఇవ్వాళ్ళ పొద్దుటే పేపర్లో ఈ స్టేట్మెంటు' అన్నారు అప్పాజీ విసుగ్గా.

'ఆళ్ళు ఒప్పుకున్నారా? అయ్యో' - బాపినీడు రెండు చేతులతోనూ, తల పట్టుకుని గొల్లుమన్నాడు - ' ......... ఆ ఉప్పందే కాబోలు మొన్న రాత్రి రాజుగారు ఫోన్జేసి నా పేరన ప్రెస్సు స్టేట్మెంటిచ్చేస్తానన్నాడు. దొంగ ముండా కొడుకు'

'ఆడిచ్చాడా? నువ్విచ్చావా?'

'ఆడే ఇచ్చాడు'

'సంతకం పెట్టావా?'

'పెట్టలే'

'పర్లేదులే. ఓ పిడేద్దాం' - అప్పాజీ కొంచెం శాంతించి ఆఫీసు గదిలోకి నడుస్తూ అన్నారు.

'ఏం పిడి?' - బాపినీడు ఆశ చిగురిస్తూండగా అడిగాడు.

అప్పాజీ సమాధానం చెప్పకుండా, కలం, కాగితం తీసుకుని రాయడం మొదలు పెట్టారు– 'దేశం గడ్డు పరిస్థితినెదుర్కొంటున్న ఈ సమయంలో, విభేదాలు మరచి భుజం భుజం కలిపి నడవాల్సిన ఈ తరుణంలో, పార్టీ కాదు, దేశం ముఖ్యం అని బాపినీడు లాంటి దేశభక్తులంతా పార్టీ విభేదాలు మరిచి దేశ సమగ్రతకు, జాతి ఐక్యతకు, పురోగతికి నడుం కడుతుంటే ఆయనపేరన ఈ ప్రకటన ఇచ్చిన

ప్రతిపక్షాల దేశ విద్రోహక, సమాజ విద్రోహక చర్యలను ఖండించి, గర్హించి, దేశసేవకు పునరంకి తమయ్యారు శ్రీబాపినీడు .....'

'సెబాష్ అప్పాజీ! సెక్యూలరిజం, బేక్ వర్డ్ క్లాసులూ, డెమోక్రసీ - అయి కూడా రాయండి'

'ఆయన్నీ రాశానుగానీ, ఓ ఏలి ముద్ర కొట్టు దానిమీద'

'బుల్లోడా పెన్నందుకో'

'సంతకం కాదు బాపినీడూ -ఏలి ముద్ర! సంతకవైతే ఎయ్యి రకాలుగా పెట్టి, రేప్పొద్దున్న నాది కాదు పొమ్మంటావు, మనదంతా పోలీసోళ్ళ పద్ధతి - ఫింగరు ప్రింటుంటేనే మంచిది.'

'అదేంటి అప్పాజీ! నామీద మీకామాత్రం నమ్మకం లేదా - నేనెలాంటోణ్ణో మీకుతెలీదా.' అన్నాడు బాపినీడు అమాయకంగా.

'నా శిష్యులెలాంటోళ్ళో నాకు తెలీదా,' అన్నాడు అప్పాజీ నవ్వుతూ

'మీ తోడు'

'నన్ను అర్ధాంతరంగా సంపేకు బాపినీడు. తొంబై తొమ్మిదో ఏట తొంబైరోజులు పియం అవ్వాల్సినోణ్ణి - జాతకంలో రాసుంది'

'సివరికి అప్పాజీ నా పాతివ్రత్యాన్నే సెంకిస్తున్నారన్నమాట' అన్నాడు బాపినీడు బాధపడుతూ.

'పాలిటిక్సులో పాతివ్రత్యవేంటి? పాలిటిక్సులో జుట్టు పండిపోయి రాలిపోయినోణ్ణి నాదగ్గర చెప్పకు ఈ కబుర్లు'

'ఒరే బుల్లోడా - ఆ స్టేంప్ పేడ్ అందుకోరా' అన్నాడు బాపినీడు మరి తప్పక.

ఆ రాత్రంతా తను యమ్మెల్యే అయిపోయినట్లు, మంత్రి అయిపోయినట్లు, ముఖ్యమంత్రి అయిపోయినట్లు, తన ఇల్లు బంగారంతో నిండిపోయినట్లు తీయటి కలలతో బాపినీడుకి నిద్రపట్టలేదు. ఉదయమే దైవ ప్రార్థన అయ్యాక, 'సూడు - బుల్లోడొస్తే ఆఫీసు గదిలో కూసోమని చెప్పు - లోపలకు మాత్రం రానివ్వక' అని వంటవాడితో చెప్పి, డజను కోడిగుడ్లతో ఆమ్లెట్లు వేయించుకుని తృప్తిగా నాస్తా తీసుకుని, బ్రేవ్ మని త్రేనుస్తూ, ఆఫీసు గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడి, 'ఏంటి దేసెం విశేషాలు బుల్లోడా' అని అడిగాడు, అర్ధనిమీలిత నేత్రాలతో, అక్కడ బుద్ధిగా కూర్చున్న బుల్లోడికేసి చూస్తూ.

కళ కళలాడుతున్న బాపినీడు మొహం కేసి ఓ సారి చూసి, 'మీ స్టేట్‌మెంట్ పేపర్లో వచ్చింది' అన్నాడు బుల్లోడు క్లుప్తంగా.

'మన దశ మారిపోయింది బుల్లోడా! నీకేం కావాలో కోరుకో' అన్నాడు బాపినీడు వరాలిచ్చే దేవుడిలా, బుల్లోడి పాత తప్పులన్నింటిని ఉదారంగా క్షమించేస్తూ.

'మీ దశా మారలేదు. నా దశా మారలేదు. ఎదవ జాతకాలు ఎదవ జాతకాలే,' అన్నాడు బుల్లోడు నిర్లిప్తంగా.

'అదేంటి బుల్లోడా - మనపార్టీ పవర్లో ఉంది కదా'

'ఏ పార్టీ?'

'ఇంకే పార్టీ? ఈ రోజు ఏ పార్టీలో ఉన్నామో ఆ పార్టీ'

'ఈ రోజు ఏ పార్టీలోఉన్నామో ఆ పార్టీ మొన్న మనం ఏ పార్టీలో ఉన్నామో ఆ పార్టీ పొజిషన్‌లోకి వెళ్ళి, మొన్నటి పార్టీ, నిన్న మనం చేరిన పార్టీ పొజిషన్‌లోకి ఈ వేళ వచ్చింది' అన్నాడు బుల్లోడు తికమకగా.

'బుల్లోడా - నువ్వు ఇలా పొడుపు కథలతో పొడిసి సంపక, సంగతేంటో సూటిగా చెప్పు' అన్నాడు బాపినీడు విసుగ్గా.

'రూలింగుపార్టీలోనుంచి ఎనభైమంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిమీద అవిశ్వాసం ప్రకటించి, ఆపోజిషన్‌తో చేతులు కలిపి, గవర్నమెంటు పడగొట్టేసి, రాజుగారిని కుర్చీలో కూర్చోబెడుతున్నారు. అదీ న్యూసు' - ఆ రోజు పేపర్లో పతాక శీర్షిక వార్త చూపిస్తూ అన్నాడు బుల్లోడు.

'అంటే, ఇయాల మన పొజిషనేంటి?'

'మొన్న ఉన్నచోటే ఉంటే ఇవాళ్ళ పవర్లో ఉండేవాళ్ళం. నిన్న మారడం వల్ల ఇవాళ మొన్నటి పొజిషన్‌లోకి వెళ్ళిపోయాం ' అని మళ్ళీ తికమకగా చెప్పి , బాపినీడు మొహం క్వశ్చన్ మార్కులా సాగడం చూసి, 'అంటే బాపినీడుగారి ఇవ్వాల్టి పొజిషన్ ఆపోజిషనే'అని అరటి పండు ఒలిచి పెట్టినట్లు బుల్లోడు వివరిస్తుండగా -

'బు...ల్లో...డా...' అని బాపినీడు ఓ అరుపు అరిచి, కళ్ళు తేలేసి, కుర్చీలో వాలిపోతూ, కాళ్ళ దగ్గరున్న వేస్ట్ పేపర్ బేస్కెట్‌ని తన్నేశాడు.

'అరే ! ముసిలోడు బేస్కెట్ తన్నేశాడే' అనుకుని, అంతలో బేస్కెట్ బకెట్ అవుతుందా కాదా అని డౌటొచ్చి, ఏం తోచక డాక్టర్‌గారికి ఫోన్ చేసి, ' డాక్టరు గారూ! నేను బాపినీడుగారి సెక్రటరీ బుల్లోడిని మాట్లాడుతున్నానండి. బాపినీడు గారు బేస్కెట్ తన్నేశాడండి ఆయ్! బేస్కెట్టేనండి - వేస్ట్ పేపర్ బేస్కెట్ - ప్లాస్టిక్‌ది - అది తన్నే శాడండి- బేస్కెట్ అన్నా బకెట్ అన్నా ఒకటేకదండి - లేదండి - ఇప్పటిదాకా బాగానే ఉన్నారండి - నాస్తా అని చెప్పి, బకాసురుడిలా డజన్ కోడిగుడ్లు - ఆయ్! డజనండి - తినకూడదని చెప్పానండి - హార్టూ, బీపీ, షుగరు కంప్లేంటు, పవరు కంప్లెంటు, ఇన్ని కంప్లేంట్లతో గేరంటీగా సచ్చిపోతారని కూడా చెప్పానండి. మా పెద్ద మామయ్య ఇలాగే కోడికి కోడి లాగించేసి - గుడ్లు కాదండి, కోడేనండి - బకెట్ తన్నేశాడండి - అది ఇనప బకె ట్టండి - అదీ చెప్పానండి- పోగాలం దాపించినోడు మన మాటెందుకింటాడండి? నాడా? నాకు నాడి చూడ్డం రాదు కాని, నాకేం డౌటు లేదండి. మీరోసారి వచ్చి చూసి ఎస్సంటే మిగతా ఏర్పాట్లు చేసేస్తావండి' అని బుల్లోడు డాక్టర్ గారితో మాట్లాడుతుండగా, బాపినీడు కళ్ళు తెరిచి, నీరసంగా , ' కొ.......కొ.....కొ.......కొ......' అన్నాడు ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తూ.

'కొలెస్ట్రాలా? గుండె పిసికేస్తోందా? మరి పిసకదా? ఒకటా, రెండా.... పన్నెండు గుడ్లు' అన్నాడు బుల్లోడు మందలిస్తున్నట్లు.

'నీ కొలెస్ట్రాల్ తగలడ' - ఉన్న ఓపికంతా కూడదీసుకుని, ఓ అరుపు అరిచి, మళ్ళీ నీరసం కమ్ముకు రాగా - 'కొ.... కొ....కొ....కొ.... కొంచెం మంచినీళ్ళిచ్చి,.... అ....అ..... అర్జంటుగా అ....అ.....అప్పాజీకి ఫోను కొట్టరా మొగడా, నన్ను

సం....సం....పెయ్యాక' అన్నాడు బాపినీడు దీనంగా రెండు చేతులు జోడించి బుల్లోడికి నమస్కరిస్తూ.

( ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, నవంబర్ 30 - 6 డిసెంబర్ 1994)